క్లుప్తంగా

విద్యార్థులకు ఉచిత శిక్షణ


శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

దొనకొండ: స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో స్థానిక ఆనంద ఆశ్రమంలో రెండు రోజుల నుంచి విద్యార్థులకు శంఖం, వేణువు, అనక్ లో ప్రాథమిక ఉచిత శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని పలు గ్రామాల నుంచి విద్యార్థులు ఆనంద ఆశ్రమానికి చేరుకున్నారు. సుమారు 70 మంది శిక్షణ తీసుకున్నారు. శిక్షణలో పాల్గొన్న వారికి ఉచిత వసతి భోజనం సౌకర్యం భైరవానంద స్వామి కల్పించారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

యాదవ సంఘం కార్యవర్గ ఎన్నిక


యాదవ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో యాదవ సంఘం గిద్దలూరు మండల నూతన కార్యవర్గ సమావేశం యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్రా శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా నంద్యాల ఈశ్వరయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శిగా బొంతా శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షుడుగా ముత్యాల యల్లయ్యయాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు జంగాల బాలయ్యయాదవ్, యాదవ సంఘం నాయకులు ఓ.వెంకటయ్యయాదవ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


వాహనదారులను తనిఖీ చేస్తున్న పోలీసులు

గిద్దలూరు రూరల్: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్థానిక సీఐ కె.సురేష్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సెంటర్‌లో ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. మద్యం తాగుతూ వాహనాలు నడుపుతున్న పది మంది పై కేసులు నమోదు చేశారు.

నీటి శుద్ధి కేంద్రానికి శంకుస్థాపన


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని ముండ్లపాడు రోడ్డులో రూ.10 కోట్ల నిధులతో మురుగు నీటి శుద్ధి కేంద్రానికి ఆదివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర పంచాయతీ అభివృద్ధికి ప్రయత్నిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ ఐ.శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యుడు మధుసూదనరావు, ఏఈ రవీంద్ర, సీనియర్ అసిస్టెంట్ టపావలి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతోనే విజయం పదిలం

- మరో వారం రోజుల్లో పదో తరగతి పరీక్షలు
- గడువు సమీపిస్తుండటంతో విద్యార్థుల్లో ఆందోళన
- భయం వీడి చదవాలని ఉపాధ్యాయుల సూచన
- ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వైద్యుల హితవు



పుల్లలచెరువు:

పదో తరగతి విద్యార్థి బంగారు భవితకు పునాది. పబ్లిక్ పరీక్షలు అనగానే అటు తల్లిదండ్రులు.. ఇటు విద్యార్థులు ఒకింత ఆందోళనకు గురవడం సహజం. మార్చి 17 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇప్పటికే విద్యాశాఖ ప్రకటించింది. పరీక్షలకు ఇక వారం రోజుల సమయం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో భయం.. ఒత్తిడి.. ఆందోళనను అధిగమించి మంచి మార్కులు సాధించాలని సబ్జెక్టు నిపుణులు సూచిస్తున్నారు. సిలబస్‌ను ప్రణాళికాబద్ధంగా రివిజన్ చేసుకుంటూ, కొన్ని టిప్స్ పాటించడం ద్వారా పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చని చెబుతున్నారు.సమయం దగ్గర పడుతున్న కొద్దీ కొందరు ఆందోళనకు గురై ఎక్కువ సమయం చదువుకే కేటాయిస్తుంటారు. అధిక మార్కులు సాధించాలంటే చదవడంతోపాటు ఆరోగ్యం, నిద్ర, ఆహారం చాలా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. పరీక్షల సమయంలో త్వరగా జీర్ణమయ్యే సాత్వికాహారం, అందులోనూ సమతుల పోషక విలువలు ఉండేలా చూసుకోవడం ముఖ్యమని వైద్యులు చెబుతున్న మాట. మసాలా, జంక్, ఫాస్టుఫుడ్ జోలికి వెళ్లకూడదని, కాచి చల్లార్చిన నీటిని గ్లూకోజ్, బార్లీ, మజ్జిగ, కొబ్బరి నీళ్ల లాంటివి తీసుకోవాలని సూచిస్తున్నారు. శీతలపానీయాలకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. పరిశుభ్రతపై శ్రద్ధ వహిస్తూ రోజుకు అరగంట సమయం యోగా, చిన్నపాటి శారీరక వ్యాయామం చేయాలని పేర్కొంటున్నారు.

వైపాలెం నియోజకవర్గంలో టెన్త్ విద్యార్థుల వివరాలు

మండలం	పరీక్ష రాస్తున్న విద్యార్థులు
దోర్నాల	600
పెద్దారవీడు	630
పుల్లలచెరువు	410
త్రిపురాంతకం	810
వై.పాలెం	950

ఇలా చేద్దాం.. ఒత్తిడిని జయిద్దాం..

- ఏకధాటిగా చదవకుండా మధ్యలో కొంత సేపు విరామం ఇస్తే చదివినవి గుర్తుంటాయి.
- ఏకాగ్రత దెబ్బతినకుండా నిర్దేశించుకున్న విధంగా ప్రణాళికబద్ధంగా పాఠ్యాంశాలు చదవాలి.
- ప్రతి అంశాన్ని ఆకళింపు చేసుకుని చదివితే అన్నీ గుర్తుంటాయి.
- చదివిన వాటిని పునశ్చరణ చేసుకుంటే పరీక్షల సమయంలో ఏకాగ్రతతో చక్కగా రాయడానికి అవకాశం ఉంటుంది.
- అనవసరమైన ఆలోచనలు పెట్టుకోకుండా సెల్‌పోన్, టీవీలకు దూరంగా ఉండాలి

చదువుతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి



విద్యార్థులు నిద్రలేమితో చదివితే పలు రకాల రుగ్మతలకు గురయ్యే ప్రమాదం ఉంది. రోజుకు ఏడు గంటల పాటు నిద్ర ఉండేలా చూసుకోవాలి. పోషక విలువలుగల ఆహారం, పండ్ల రసాలు తీసుకోవాలి. తద్వారా జ్ఞాపక శక్తి మెరుగుపడుతుంది. ఎండల తీవ్రత పెరుగుతున్నందున తల్లిదండ్రులు కూడా పిల్లల ఆహారం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.


– డాక్టర్ లక్ష్మీనరసింహ, పుల్లలచెరువు పీహెచ్‌సీ, పుల్లలచెరువు


పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

భక్తి శ్రద్ధలతో లక్ష్మీనృసింహస్వామి తిరునాళ్ల


కొండపై వేంచేసి ఉన్న లక్ష్మీనృసింహస్వామికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

కురిచేడు: మండలంలోని దేకనకొండ కొండపై, స్థానిక కోనవల్లభరాయస్వామి కొండపై వేంచేసి ఉన్న లక్ష్మీ నృసింహస్వామి తిరునాళ్ల ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు పెద్దసంఖ్యలో చేరి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు చేసి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రికి దేకనకొండలో విద్యుత్ ప్రభలు నిర్మించి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగాభవానీ, వేనూతల కాటమరాజుస్వామి, పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన నాగాంజనేయస్వామి పుట్టకు భక్తులు భక్తిశ్రద్ధలతో విశేష పూజలు ఆదివారం నిర్వహించారు. కాటమరాజు స్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అంకాళమ్మ దేవతకు మహిళలు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. అంకాళమ్మ దేవతను పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో అలంకరించారు. ఉగాది పండుగకు ముందు మొక్కుబడులు ఉన్న వారు ఆలయాల ప్రాంగణంలో పొంగళ్లతో పాటు పొట్టేలు, నాటు కోళ్లను కోసి స్వామి, అమ్మవార్లకు చెల్లించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి, మొక్కులు చెల్లించారు.


పెద్దారవీడులో ప్రత్యేక అలంకారంలో అంకాళమ్మ దేవత

వికసిత్ భారత్ సదస్సులో లా కాలేజీ విద్యార్థుల ప్రతిభ


ప్రశంస పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

మార్కాపురం: కర్నాటక రాష్ట్రంలోని బళ్లారిలో విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన వికసిత్ భారత్ జాతీయ సదస్సులో మార్కాపురం ఎస్ఎస్ లా కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారని చైర్మన్ నాదెళ్ల చంద్రమౌళి, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కోనయ్య తెలిపారు. న్యాయ కళాశాల విద్యార్థులు సిహెచ్ శ్రీనివాసరెడ్డి, జి.సుందర శ్రీరామ్, హసన్, ఖాశీంసా, దివ్య, వెంకటస్వాములు వికసిత్ భారత్ సదస్సులో పాల్గొని పేపర్ ప్రెజెంటేషన్ ఇవ్వడంలో ప్రతిభ కనబరిచి ప్రశంస పత్రాలు అందుకున్నారని వివరించారు. ఆదివారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.

అధ్వానంగా శ్రీవారి పుష్కరిణి


కోనేరు చుట్టూ పెరిగిన చెట్లు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండస్వామి ఆలయ సమీపంలోని శ్రీవారి పుష్కరిణి పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. కోనేరులో నీరు ఉన్నప్పటికీ చుట్టూ చెట్లు పెరిగిపోవటంతో భక్తులు వెళ్లే మార్గం మూసుకుపోయింది. శ్రీవారి బ్రహ్మోత్సవాల ముగింపు రోజున స్వామివారికి పుష్కరిణిలో చక్రస్నానం చేయించడం ఆనవాయితీ. అలాంటి పుష్కరిణి నేడు చెట్లతో అల్లుకుపోయి అధ్వానంగా ఉంది. ప్రతి శనివారం వెలుగొండ వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివస్తుంటారు. అయితే తలనీలాలు సమర్పించిన భక్తులతో పాటు ఆలయానికి వచ్చే వారు కోనేటిలో స్నానం చేసి స్వామివారిని దర్శించుకునే అవకాశం లేకుండాపోయింది. ఈ నెల 13 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఇప్పటికే అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో పుష్కరిణి అభివృద్ధిపై దృష్టి సారించాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.


కోనేరు చుట్టూ పెరిగిన చెట్లు

వీడని బర్డ్‌ఫ్లూ భయం..!

- కొనుగోలుదారులు లేక పడిపోయిన వ్యాపారం
- అయోమయంలో చికెన్ సెంటర్ల దుకాణదారులు

కొనకనమిట్ల: ఇటీవల పొరుగు జిల్లాల్లో బ్రాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి సోకి చనిపోవడంతో ప్రజల్లో మొదలైన భయం నేటికీ వీడలేదు. పొరుగు జిల్లాల్లో రెడ్ జోన్ ఎత్తేసినప్పటికీ చికెన్ కొనేందుకు వినియోగదారులు ముందుకు రావడంతో వ్యాపారం భారీగా పడిపోయింది. బర్డ్ ఫ్లూ ఉన్న జిల్లాల నుంచి కోళ్ల దిగుమతిని పూర్తిగా నిలిపేసిన అధికారులు పరిస్థితులు చక్కబడ్డాక రెడ్ జోన్‌ను కూడా ఎత్తేశారు. మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఎక్కడా బర్డ్ ఫ్లూ లేదని, అలాంటి భయం అవసరం లేదని పశు సంవర్ధక శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నా.. ప్రజలు మాత్రం చికెన్ కొనేందుకు జంకుతుండటం గమనార్హం. తరచూ చికెన్ కొనేవారు సైతం దుకాణల దరిదాపులకే రావడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. కొనకనమిట్ల, గొట్లగట్టు, పెదారికట్ల, చినారికట్ల జంక్షన్లలో, అలాగే నాగంపల్లి, వెంగళలపల్లి, నాయుడుపేట, మునగపాడు గ్రామాల్లో చికెన్ దుకాణాలు ఆదివారం వెలవెలబోయాయి. ఇతర మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. దీంతో చికెన్ విక్రయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం మటన్, చేపల దుకాణాలు జనంతో కళకళలాడాయి. చికెన్ విక్రయాలు పడిపోవడంతో మటన్, చేపల ధరల పెంచారని మాంసప్రియులు చెబుతున్నారు. ధర తగ్గించినప్పటికీ వినియోగదారులు రాకపోతుండటంతో.. అధికారులు చొరవచూపి ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని వేడుకుంటున్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డి

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం, సోమవర్పాడు పంచాయతీ పరిధిలో ఉన్న ప్రసిద్ధ పుణ్య క్షేత్రం గుంటిగంగ భవాని అమ్మవారిని, మల్లిఖార్జున స్వామి వారిని, నాగమ్మ తల్లిని శిలలను ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారిని అర్చకులు పి.విజయ లక్ష్మి, యం.బాలరాజు, కామేశ్వర శర్మ అలంకరించారు. ఈఓ గుంటపల్లి వాసు, ఆర్ఏకే.ప్రసాద్ రావు, ఆలయ చైర్మన్ కె.గురుబ్రహ్మం భక్తులకు వసతులు సమకూర్చారు. తాళ్లూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షునిగా రెండో సారి నియమితులైన తూము వెంకట సుబ్బారెడ్డి గుంటిగంగా భవాని అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన్ను శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో గుంటిగంగా భవాని దేవస్థానం మాజీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, భీమిరెడ్డి నాగమల్లేశ్వరరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పునూరి దేవదానం, లక్కవరం ఎంపీటీసీ కొటేసు, పునూరి చిన్న నాగరాజు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో గుంటి గంగ అమ్మ వారు

రమణారెడ్డికి అభినందనలు తెలిపిన నాయకులు


గంటా రమణారెడ్డి అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దదోర్నాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దదోర్నాల మండల కన్వీనర్‌గా రెండో సారి ఏకగ్రీవంగా ఎంపికైన గంటా వెంకట రమణారెడ్డికి పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన గృహానికి చేరుకున్న పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకుడు సింగా ప్రసాద్, మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చాట్ల గంగయ్య, పెద్దబొమ్మలాపురం, జమ్మిదోర్నాలకు చెందిన పలువురు నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ తనకు మండల కన్వీనర్‌గా రెండో సారి అవకాశం కల్పించిన యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సమాజ మార్గదర్శకులు పాత్రికేయులు

- మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: సమాజానికి మార్గదర్శకులు పాత్రికేయులని మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పశ్చిమ ప్రకాశం తొలితరం పాత్రికేయుడు ఓరుగంటి రమణయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జంకె మాట్లాడుతూ.. పాత్రికేయులు సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. పాత్రికేయ వృత్తి పవిత్రమైందని, ఓవీ రమణయ్య పాత్రికేయులకు ఆదర్శమని కొనియాడారు. సీనియర్ పాత్రికేయులు, ఓవీ రమణయ్య కుమారుడు ఓఏ మల్లిక్ మాట్లాడుతూ.. పాత్రికేయులు వృత్తి విలువలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు డి.మోహన్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, దొనకొండ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు. సీనియర్ పాత్రికేయులు కేవీ సత్యనారాయణ, ఎం.అల్లూరెడ్డితోపాటు పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. ఓవీ రమణయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న జంకె వెంకటరెడ్డి

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌కు అభినందనలు


కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

దొనకొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్‌గా మూడోసారి నియమితులైన కాకర్ల కృష్ణారెడ్డిని పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ... కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తమ మీద నమ్మకంతో కన్వీనర్‌గా నియమించిన వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దర్శి ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కొచ్చెర్లకోట గ్రామానికి చెందిన కార్యకర్తలు కృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. గొంగటి పోలిరెడ్డి, అంకిరెడ్డి, పెద్దిరెడ్డి, వినుకొండ కొండలరావు, వీరాచారి, చీరాల ఇశ్రాయేలు, వినుకొండ లాజరు, వినుకొండ అబ్రహాము, వినుకొండ కాశయ్య, ప్రసాద్, వెంకటేశ్వర్లు, పి.కోటేశ్వరరావు, సీహెచ్ గాలయ్య, పి.సత్యం తదితరులు పాల్గొన్నారు.